గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా పాలన

- పెరుగుపాళ్యంలో 'గడప గడపకూ..'లో మంత్రి ఉషశ్రీ చరణ్


పెరుగుపాళ్యంలోని సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

శెట్టూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రజల ముంగిటకే పాలన అందిస్తున్నారని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం , మహిళ సాధికారతే లక్ష్యంగా 50 శాతం రిజర్వేజన్లు, దిశ చట్టం అమలు చేస్తున్నట్లు తెలిపారు.

శుక్రవారం మండలంలోని పెరుగుపాళ్యం, పర్లచేడు, బుడ్డయ్య దొడ్డి, గంటయ్య దొడ్డి, కాటప్పగారితోట గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమానికి మంత్రి చేపట్టారు. గ్రామానికి చేరుకున్న మంత్రికి ప్రజలు, నాయకులు (స్థానిక సర్పంచ్) సచివాలయ కన్వీనర్ తీన్మార్ తిమ్మరాజు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం ప్రతి గడప వద్దకు వెళ్లిన మంత్రి లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేసి, వారికి అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు వర్తింపు

అర్హతే ప్రామాణికంగా కులాలు, మతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మంత్రి అన్నారు. గ్రామంలో 832 కుటుంబాలుంటే అన్ని కుటుంబాలకు సంక్షేమ పథకాలు వర్తించాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏ కుటుంబానికీ పథకాలు అందలేదన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చేస్తామని, రోడ్లు, డ్రైన్లు, బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. చెరువులకు సాగునీరు ఇచ్చి రైతులకు ఆదుకుంటామని మంత్రి తెలియజేశారు.

కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, ఇంచార్జ్ ఎంపీడీఓ గంగావతి, కళ్యాణదుర్గం ఎంపీపీ మారుతమ్మ, కళ్యాణదుర్గం సచివాలయ కన్వీనర్ అర్చన, సర్పంచ్‌లు సత్యనారాయణ రెడ్డి, పాలాక్షి, గంగన్న, నాగరాజు, సిద్దలింగప్ప, సచివాలయాల కన్వీనర్ తీన్మార్ తిమ్మరాజు, మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి, నాయకులు బొమ్మజ్జి రమేష్, రామకృష్ణ, సోమశేఖర్, కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, మహిళా నాయకురాలు సంధ్యారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధమ్మ, ఇంతర మండల, గ్రామ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కణేకల్లు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గంగలాపురంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు మృత్యుంజయ, ఫకృద్దీన్, దేవేంద్రతో కలిసి విప్ కాపు ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్ పింఛన్ కానుక ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారా? ఎప్పటి నుంచి ఇలా వచ్చి ఇస్తున్నారంటూ లబ్ధిదారులను ఆరాతీశారు. జగనన్న సీఎం అయ్యాకే మా ఇళ్ల వద్దకొచ్చి పింఛన్ ఇస్తున్నారని వృద్ధులు ఆనందంతో తెలిపారు. పింఛన్ కోసం గంటల తరబడి కళ్లు కాయలు కాసేలా వేచి చేసేవాళ్లమని, ఆ కష్టాలిప్పుడు లేవు సార్ అన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని మహిళలను ప్రశ్నించగా.. అన్నీ పథకాలు సక్రమంగా అందుతున్నాయన్నారు. ఈసందర్భంగా విప్ కాపు మాట్లాడుతూ ఏ పథకానికైనా అర్హత ఉంటే చాలన్నారు. పథకాల కోసం గత టీడీపీ పాలనలో మాదిరిగా ఎవరి సిఫార్సు అవసరం లేదన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.

మాయగాళ్లు...మోసగాళ్లను నమ్మొద్దు

ఒకే ఒక్కఛాన్స్ ఇవ్వండంటూ మాయగాళ్లు... మోసగాళ్ల మీ వద్దకొస్తే నమ్మొద్దని విప్ కాపు ప్రజలకు తెలియజేశారు. 2014 ఎన్నికల్లో అధికారంలో వచ్చిన టీడీపీ ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, సంక్షేమానికి వినియోగించాల్సిన డబ్బంతా మెక్కేశారన్నారు. చంద్రబాబుకు టీడీపీ నాయకులు, కార్యకర్తల ప్రయోజనాలు తప్ప పేదల సంక్షేమం పట్టదన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న విప్ కాపు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టీ కేశవ రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యులు పెద్దదేవర మాబుపీరా, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణ, భీమన్న, ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నసర్మస్, డాక్టర్ సోమన్న, హనుమంతరావు, ప్రకాష్‌చౌదరి, పులచెర్ల బషీర్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రారంభమైన రోడ్డు భద్రతా వారోత్సవాలు


మాట్లాడుతున్న ఆర్టీసీ డీపో మేనేజర్ రామచంద్ర

కళ్యాణదుర్గం: స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆర్టీసీ డీఎం రామచంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పట్టణ మహిళా ఎస్ఐ ఆశాబేగం హాజరయ్యారు. ఎస్ఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. 27 నుంచి ఫిబ్రవరి 2 వరకు భద్రతా వారోత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, గ్యారేజీ, భద్రతా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

కళ్యాణదుర్గంరూరల్ : మండలంలోని పాలవాయి గ్రామంలో శనివారం మధ్యాహ్నం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ మారుతమ్మ, జెడ్పీటీసీ బొమ్మన్న, సచివాలయ మండల కన్వీనర్ ఆంజనేయులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాన్ని సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం ఉదయం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులు ,మండల స్థాయి అధికారులు ,గ్రామ సచివాలయ సిబ్బంది, నాయకులు తప్పకహాజరు కావలెనని ఆయన తెలిపారు.

ఇన్‌చార్జ్ వీఆర్వోగా సేతుమాధవ్

కూడేరు: కలగళ్ల, మరుట్ల ఇన్‌చార్జ్ వీఆర్ఓగా సేతుమాధవ్‌ను శుక్రవారం నియమించారు. కలగళ్ల , మరుట్ల రెవెన్యూ గ్రామాల వీఆర్వో జానకిరామయ్య మెడికల్ లీవ్‌పై వెళ్లారు. దీంతో ఆయా రెవెన్యూ గ్రామాల ప్రజలు కుల,. ధ్రువీకరణ పత్రాలు, ఇతర సర్టిఫికెట్ల సంతకాల కోసం ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఇన్‌చార్జ్‌ను నియమించారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థి ఎంపిక


జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల 9 తరగతి విద్యార్థి సీ గోపీనాథ్ జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రామాంజనేయులు, హెచ్ఎం లక్ష్మీపతి శుక్రవారం తెలిపారు. ఈ నెల 20 వతేదీ నుంచి 23 వతేదీ వరకూ నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ క్రీడాపోటీలు జరిగినట్లు వారు తెలిపారు. అండర్ -17 విభాగంలో సీమల్లికార్జున, బీవీ మహేష్, బీవీ సోమశేఖర్ అండర్-14 విభాగంలో సీ గోపినాథ్, వీజీ విష్ణులు అనంతపురం జిల్లా జట్టు తరపున తృతీయస్థానం సంపాదించారు. అందులో గోపీనాథ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

పౌష్టికాహారం ఇవ్వాలి


అనుంపల్లిలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ వేణుకార్తికేయ

శెట్టూరు: పిల్లలకు రోజూ పౌష్టికాహారం ఇవ్వాలని డాక్టర్ వేణుకార్తికేయ తెలిపారు. శుక్రవారం అనుంపల్లిలో ఇంటివద్దకే వైద్యం (ఫ్యామిలీ డాక్టర్) కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పిల్లలకు, వృద్ధులకు, రోగులకు పరీక్షలు నిర్వహించి, వైద్యం అందించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

బొమ్మనహాళ్: విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన , రుచికరమైన భోజనం అందించాలని సర్పంచ్ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని సిద్దరాంపురంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పాఠశాలలో భోజనం రుచి చూశారు.

రాయదుర్గంలో ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

- బైక్ ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి


ఎలక్ట్రీషియన్లతో కలిసి కేక్ కట్ చేసి సంబరాల్లో పాల్గొన్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గంటౌన్: పట్టణంలో ఎలక్ట్రీషియన్ డేను శుక్రవారం నిర్వహించారు. రాయదుర్గం ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన బైక్ ర్యాలీకి వందలాది మంది ఎలక్ట్రీషియన్లు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎలక్ట్రీషియన్లతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ప్రారంభమైన ర్యాలీ లక్ష్మీబజార్, పాతబస్టాండ్, వినాయకసర్కిల్, బళ్లారి రోడ్డు మీదుగా శాంతినగర్‌లోని బైలాంజనేయస్వామి గుడి వద్ద గల పద్మశాలీయ కల్యాణ మంటపం వరకు కొనసాగింది. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎలక్ట్రీషియన్ల అసోసియేషన్ ప్రతినిధులు పలు సమస్యలను విప్ దృష్టికి తీసుకొచ్చారు. ఎలక్ట్రీషియన్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని విప్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి దృష్టికి సైతం సమస్యలు తీసుకెళ్లి అవకాశం వస్తే అసెంబ్లీలో ప్రస్తావించనున్నట్లు ఏదో ఒకరకంగా మంచి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్మికులు కోరుతున్నట్లు యూనియన్ కోసం స్థలం, కార్మిక శాఖలో లేబర్ కార్డుల జారీలో ఎలాంటి జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి అజీజ్, ఉపాధ్యక్షుడు మున్నా, జాయింట్ సెక్రటరీ అహ్మద్, ట్రెజరర్ హరి పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం


కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న అర్బన్, రూరల్ సీఐలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: ఉరవకొండ సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న ముగ్గురు కానిస్టేబుళ్లను రూరల్ సీఐ శేఖర్, అర్బన్ సీఐ హరినాథ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం సన్మానించారు. మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ వన్నప్ప ఆధ్వర్యంలో అవార్డులు పొందిన కానిస్టేబుళ్లు కులశేఖర్‌రెడ్డి, ఓబులేసు, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్‌ను సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తిప్పయ్య, విడపనకల్లు మండల కన్వీనర్ బసన్న, కోఆప్షన్ సభ్యుడు లతీఫ్, యువనాయకులు సింగాడి ధనంజయలు పాల్గొన్నారు. జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబులేసు ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లను సన్మానించారు.

2 నుంచి బృహత్ నందీశ్వర విగ్రహ ప్రతిష్ట


ఆశ్రమంలో ప్రతిష్ఠించనున్న బృహత్ నందీశ్వర శిలా విగ్రహం

వజ్రకరూరు: గూళ్యపాళ్యంలోని గురుదేవా ఆశ్రమంలో ఫిబ్రవరి 2 నుంచి బృహత్ నందీశ్వర శిలా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి ప్రణవా నందగిరి గురుస్వామి తెలిపారు. శుక్రవారం ఆశ్రమంలో బృహత్ నందీశ్వర శిలా విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పీఠాధిపతి మాట్లాడుతూ మూ డు రోజులపాటు ఆశ్రమంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ సంచార పశువైద్య సేవలు వరం


సంచార పశు వైద్యసేవల వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

శెట్టూరు: వైఎస్సార్ సంచార పశువైద్యసేవలు పాడి పాడిరైతులకు వరమని మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. శుక్రవారం పెరుగుపాళ్యంలో ఏడీ నాగలింగేశ్వ రెడ్డితో కలిసి సంచార పశువైద్యసేవల వాహనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆధునిక సౌకర్యాలతో వైఎస్సార్ సంచార పశు వైద్యశాలలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. నియోజకవర్గానికి ఒక వాహనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సేవల కోసం 1962 టోల్ ఫ్రీ నంబర్ ఉందన్నారు. వాహనంలో పశువులకు 35 రకాల టెస్టులు చేసే ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, ఇంచార్జ్ ఎంపీడీఓ గంగావతి, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, సచివాలయల కన్వీనర్ తీన్మార్ తిమ్మరాజు, మాజీ మండల కన్వీనర్ సోమనాథరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం

కళ్యాణదుర్గం: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్‌ను ఇటీవల ఎంపికైన సచివాలయాల మండల కన్వీనర్లు శుక్రవారం సన్మానించారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో కళ్యాణదుర్గం అర్బన్ కన్వీనర్ అర్చన, రూరల్ కన్వీనర్ ఆంజనేయులు శాలువాలు కప్పి, సన్మానించారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి శక్తివంతన లేకుండా చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మారుతమ్మ ఉన్నారు.

వెండి కిరీటం బహూకరణ

ఉరవకొండ: స్థానిక ఎస్ఎల్ఎన్ కాలనీలోని భవనేశ్వరి ఆలయంలో శ్రీపుర్ణానంద స్వామికి బెంగళూరుకు చెందిన భక్తులు వెండి కిరీటాన్ని బహూకరించారు. ఆలయ చైర్మన్ గవ్వల సోమశేఖర్ మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన శ్రీనివాస్, మంజుల దంపతులు, నరసమ్మ, నరసయ్య, స్నేహ, సింధులు రూ.లక్ష విలువ చేసే వెండి కిరీటాన్ని బహూకరించారు.

రథసప్తమికి ఉత్సవమూర్తుల రాక


ఆమిద్యాల నుంచి ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం నిర్వహించనున్న రథసప్తమి వేడుకలకు ఆమిద్యాల నుంచి ఉత్సవ మూర్తులను ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పెన్నహోబిలానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు.

పద్మశాలి సంఘం సహాయ కార్యదర్శిగా సోమశేఖర్

ఉరవకొండ: రాయలసీమ ప్రాంతీయ పద్మ శాలి సంఘం సహాయ కార్యదర్శిగా ఉరవకొండకు చెందిన పద్మాశాలి సంఘం నాయకులు సోమశేఖర్‌ను నియమిస్తూ శుక్రవారం పద్మా శాలీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ నియామక పత్రం అందించారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

శెట్టూరు: మండలంలో వివిధ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని సెబ్ సీఐ బాషా, ఎస్ఐ యువరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ధ్వంసం చేశారు. కొన్ని రోజుల నుంచి పట్టుబడిన సుమారు రూ. 77,700 విలువ గల మద్యం 2,220 ప్యాకెట్లను ట్రాక్టర్‌తో తొక్కించి, ధ్వంసం చేశారు.

నేడు రథోత్సవం

డీ హీరేహాళ్ (రాయదుర్గం): డీ హీరేహాళ్ మండలంలోని కల్యంలో శనివారం ఆంజనేయ స్వామి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పుష్పవతి, ఎంపీటీసీ అనిత, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, కల్యం సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం


కొనకొండ్లలో మాట్లాడుతున్న తహసీల్దార్ అనిల్‌కుమార్ తదితరులు

వజ్రకరూరు: భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రీసర్వేకు శ్రీకారం చుట్టారని తహసీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొనకొండ్ల, ఛాయాపురం గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష పథకంపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు మేలు చేయడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అన్ని గ్రామాల్లో భూ రికార్డులను క్షేత్ర స్థాయి భూరికార్డుల ప్రక్షాళన చేస్తున్నట్లు తెలిపారు. రైతులు రీసర్వేను తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పాపన్న, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కేశవరెడ్డి, మండల సర్వేయర్ ప్రసాద్, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలు


రాతి దూలం లాగుతున్న వృషభాలు

కుందుర్పి: లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. శుక్ర వారం సాయంత్రం ఆలయం చుట్టూ పానకం బండ్ల ఉత్సవంలో భాగంగా మూడుసార్లు ప్రదక్షిణలు చేయించి, మొక్కులు చెల్లించుకున్నారు. రాతిదూలం లాగుడు పోటీల్లో మొదటి స్థానంలో గోసప్పగారి తిప్పేస్వామి ఎద్దులు, రెండో స్థానంలో అక్కులప్ప ఎద్దులు, మూడో స్థానంలో రఘువీరా ఎద్దులు, 4వ స్థానంలో మూర్తి ఎద్దులు, 5వ స్థానంలో హనుమంతరాయప్ప ఎద్దులు నిలిచాయి.

ఎరువుల దుకాణాల తనిఖీ


బెళుగుప్పలోని శ్రీవెంకటేశ్వర ఆగ్రో సెంటర్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని పలు ఎరువులు రసాయన మందుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. జిల్లా విజిలెన్స్ సీఐ రామారావు, విజిలెన్స్ ఏఈ రవీంద్రనాథ్, లేట పృధ్విసాగర్ కలసి స్థానిక గురుశ్రీ, శ్రీవెంకటేశ్వర ఆగ్రోస్ దుకాణాల్లో తనిఖీ చేశారు. యూరియా అమ్మకాల రిజిష్టర్లను ఆయా దుకాణాల్లో పరిశీలించారు. ప్రధానంగా గడువు ముగిసిన రసాయన మందులను గురుశ్రీ, శ్రీవెంకటేశ్వర దుకాణాల్లో రూ.13,000, రూ.18,000 చొప్పున మందులను గుర్తించి సీజ్ చేశారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపిద్దాం


ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బెళుగుప్ప: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపిద్దామని వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, కాలువపల్లి సర్పంచ్ ఎండీ పెద్దన్న తెలిపారు. శుక్రవారం మండలంలోని కాలువపల్లి, రామసాగరం, జీడిపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డికి మద్దతుగా పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దొణతిమ్మారెడ్డి, సుధాకర్, సంజీవరాయుడు, డాక్టర్ సవిత, అనిల్, నరేష్ పాల్గొన్నారు.

సోలార్ ప్రాజెక్టుతో శాశ్వత ఉపాధి



మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, సమావేశంలో పాల్గొన్న రైతులు ,వైఎస్సార్‌సీపీ నాయకులు

- 15 వేల ఎకరాల్లో ప్రాజెక్ట్ నిర్మాణానికి డ్రోన్ సర్వే
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుతో రైతులు, నిరుద్యోగులకు శాశ్వత ఉపాధి లభిస్తుందని, తద్వారా నియోజకవర్గంలోని డి హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, రాయదుర్గం మండలాలు పారిశ్రామికంగా ప్రగతి బాటలో నడుస్తుందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన స్వగృహంలో డీహీరేహాళ్ మండలంలోని మలపనగుడి, ఓబుళాపురం గ్రామ రైతులు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. విప్ మాట్లాడుతూ సోలార్ ప్రాజెక్టుకు భూములు ఇస్తే ఈ ప్రాంత భవిష్యత్తు మారిపోతుందన్నారు. 15 వేల ఎకరాల్లో 3 వేల మెగా వాట్లతో విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సోలార్ ప్రాజెక్టు ఏర్పాటయితే ఎకరానికి రూ.30 వేలు నగదు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు. ప్రతి ఏడాది 5 శాతం పెంచుతూ లీజు అగ్రిమెంట్ పూర్తయ్యే 30 ఏళ్ల నాటికి ఎకరాకు రూ.50 వేలు వస్తుందన్నారు. ఇందుకు నెడ్‌క్యాప్ లాంటి గొప్ప సంస్థ ముందుకొచ్చిందన్నారు. భూమిలిచ్చిన రైతు పొలాల్లో త్వరలో డ్రోన్ సర్వే పూర్తి చేసి, ప్రాజెక్ట్ నిర్మాణానికి సంస్థ ప్రతినిధులు వేగంగా అడుగులు వేస్తుందన్నారు.

టీడీపీ దుష్ప్రచారాన్ని నమ్మొద్దండి : సోలర్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటైతే ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి ఎక్కడ మంచి పేరు వస్తోందోనని టీడీపీ నాయకులు పనిగట్టుకుని దుష్ప్రచారాలు చేస్తున్నారని విప్ కాపు మండిపడ్డారు. భూములు కేవలం లీజు అగ్రిమెంట్ మాత్రమే చేస్తారని, వాటిపై సర్వ హక్కులు రైతులకే ఉంటాయన్నారు. ఏ అవసరం వచ్చినా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. స్థానికులకే ఎక్కువ శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కేలా కృషి చేస్తామన్నారు. సుమారు 2 వేల కోట్ల వరకు రైతులకు ఈ ప్రాజెక్ట్ ద్వారా లాభం చేకూరే అవకాశం ఉందన్నారు. సోలార్ ప్రాజెక్టుపై వివరాలు తెలుసుకున్న మలపనగుడి, ఓబుళాపురం రైతులు భూములిచ్చేందుకు ముందుకొచ్చారు. అక్కడే వారి పేర్లను నమోదు చేసుకున్నారు. రైతులను ప్రాజెక్టులో భాగస్వామ్యం చేసేలా కృషి చేస్తామని సర్పంచులు బోయ మల్లికార్జున, రుద్రేష్ తెలిపారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ కోదండ రామ మూర్తి, డివిజన్ సర్వేయర్ సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్లు సుబ్రమణ్యం, మారుతి, డీటీ బసవకుమార్, స్థానిక మార్కెట్‌యార్డులో చైర్మన్ బోజరాజ్‌నాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వన్నూర్‌స్వామి, జెడ్పీటీసీ మహేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు కల్యం సురేష్, సింగాడి జగదీష్, నారాయణనాయక్, ఆయా గ్రామాల రైతులు, అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సూర్యనమస్కారాలు


సామూహిక సూర్యనమస్కారాలు చేస్తున్న వివిధ ప్రాంతాల భక్తులు

ఉరవకొండ: బూదగవి సూర్యనారాయణస్వామి సన్నిధిలో సామూహిక సూర్యనమస్కారాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధర్మవరం, తాడిపత్రి తదితర ప్రాంతాల నుంచి రథసప్తమికి ముందు రోజు ప్రత్యేక బస్సుల్లో బూదగవికి చేరుకొని సూర్యనమస్కారాలు చేసి స్వామి దర్శనం చేసుకుంటారు. ధర్మవరానికి చెందిన యోగా గురువులు చంద్రశేఖర్, భవనేశ్వరీ ఆధ్వర్యంలో వందలాది మంది సామూహిక సూర్య నమస్కారాలు చేపట్టారు.

ఈఓగా అంగదాల కృష్ణయ్య నియామకం

వజ్రకరూరు : మండలం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈఓగా అంగదాల కృష్ణయ్య నియామకం అయ్యారు. ఈమేరకు శుక్రవారం జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఈఓ దేవదాస్ కళ్యాణదుర్గానికి బదిలీ అయ్యాడు. ఉరవకొండలో రెగ్యులర్ ఈఓగా పనిచేస్తున్న అంగదాల కృష్ణయ్యకు వజ్రకరూరు మండలం ఇన్‌చార్జ్ ఈఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.